సాక్షి చిత్తూరు

ఆదివారం । 30 । జూన్ । 2024



రేపటి నుంచి కొత్త చట్టాలు

ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలను తీసుకువచ్చింది.

- 8లో



ఆదిలోనే అదుపుతప్పి..

చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ శనివారం కొత్త బస్సులను ప్రారంభించారు.

- 8లో



మామిడి తోటపై ఏనుగు దాడి

బంగారుపాళెం మండలం గోవర్ధనగిరిలో శుక్రవారం రాత్రి ఓ మామిడి తోటపై ఏనుగుల గుంపు దాడి చేసింది.

- 8లో

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని ఎస్పీ మణికంఠ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు.కలెక్టర్‌కు మొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఎస్పీతో కలెక్టర్ కాసేపు చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ అరీఫుల్లా పాల్గొన్నారు.

కక్షగట్టి ప్రభాకర్‌రెడ్డి సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పూర్వ సీఈఓ, బైరెడ్డిపల్లె ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డిని టీడీపీ నాయకులు కక్షగట్టి సస్పెండ్ చేయించారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎప్పుడో 15 ఏళ్లకు ముందు జరిగిన పనులు, వాటి బిల్లుల మంజూరుపై అసత్య ఆరోపణలతో వేటు వేశారని మండిపడ్డారు. నివేదిక పంపిన రెండో రోజే ఎలాంటి సంజాయిషీ అడగకుండా ఉద్యోగ విరమణకు మూడు రోజుల ముందు నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేయించడం దారుణమన్నారు. ఒకవేళ పొరబాటు వాస్తవమేనని విచారణలో తేలితే ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని వెల్లడించారు. 36 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన వ్యక్తిని ఈవిధంగా వేధించడంపై ప్రతి ఒక్కరూ ఆత్మ విమర్శ చేసుకోవాలని కోరారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సుల శిక్షణ తరగతులు శనివారం రెండో రోజూ నిర్వహించారు. 0–18 ఏళ్లలోపు పిల్లలకు వచ్చే వ్యాధులపై డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి అవగాహన కల్పించారు. పిల్లలకు సోకే వ్యాధులను గుర్తించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలకు పకడ్బందీ భద్రత



గోదాము పరిశీలనలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికలల్లో ఉపయోగించిన ఈవీఎంలకు పకడ్బందీ భద్రత కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎంలు భద్రపరిచిన గోదామును పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లోని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గోడౌన్ వద్ద భద్రతా వ్యవస్థ పటిష్టంగా ఉండాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. మూడు నెలలకు ఒకసారి రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ తనిఖీ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్, అట్లూరి శ్రీనివాసులు, సురేంద్రకుమార్, పరదేశి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రాజశేఖర్

ఐరాల: మండలంలోని ముదిగోళం, 45 కొత్త పల్లె పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను డ్వామా పీడీ రాజశేఖర్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సప్లయ్ చానల్, పెర్క్యులేషన్ ట్యాంక్ పూడిక తీత పనులు పూర్తి చేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. క్షేత్ర సహాయకులు సోమవారం నుంచి వేలాది మంది కూలీలను సమీకరించి పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీలో సరాసరి సగటు వేతనం రూ.275 తగ్గకుండా రావాలని, పని దినాలు పెంచని ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వేతనాలు సక్రమంగా వస్తున్నాయా అని కూలీలను ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీఓ సంధ్యారాణి, ఈసీ శరత్‌బాబు పాల్గొన్నారు.

బొమ్మలు చేసి.. ప్రాణం పోసి..!

SUNDAY SPECIAL

టెర్రకోట కళాకారుల చేతిలో మట్టిముద్దలు ప్రాణం పోసుకుంటున్నాయి.. ఆకట్టుకునేలా విభిన్న ఆకృతులు తయారవుతుంటాయి.. ఇక్కడ రూపుదిద్దుకున్న బొమ్మలు దేశవిదేశాల్లో కొలువుదీరుతుంటాయి.. ఆకర్షణీయమైన డిజైన్లు కళాపోషకుల హృదయాలను దోచుకుంటుంటాయి. వినూత్నంగా సిద్ధమైన ప్రతిమలు ఆన్‌లైన్‌లో సైతం అందుబాటులోకి వచ్చాయి. పలమనేరు సమీపంలోని టెర్రకోట కాలనీలో వంద కుటుంబాలు కళారూపాల తయారీలోనే ఉపాధి పొందుతున్నాయి. మరింత మంది ఔత్సాహికులకు సైతం శిక్షణ ఇస్తున్నాయి.

- టెర్రకోట కళాకృతులకు కేరాఫ్ పలమనేరు
- ఆధునిక యంత్రాల సాయంతో తయారీ
- ఇక్కడి డిజైన్లకు దేశవిదేశాల్లో డిమాండ్
- ఆన్‌లైన్‌లోనూ సాగుతున్న వ్యాపారం
- టెర్రకోట హబ్‌లో ప్రతిమల తయారీపై ఉచిత శిక్షణ.. ఉపాధి



బొమ్మను తయారు చేస్తున్న హస్త కళాకారుడు



టెర్రకోట కళాకారులు తయారు చేసిన మట్టి కళాకృతులు





అమ్మవారు, గణేశుడి ప్రతిమలు

పలమనేరు : రాష్ట్రంలోనే టెర్రకోట బొమ్మలకు పలమనేరు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ తయారయ్యే మట్టిబొమ్మలకు మన దేశంలోనే కాదు విదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. పార్లమెంటులో కనిపిస్తున్న పలురకాల కళాకృతులు ఇక్కడి తయారైనవే కావడం విశేషం.

అందరూ కళాకారులే..!

పలమనేరు పట్టణ సమీపంలోని గంటావూరు టెర్రకోట కాలనీలో వంద కుటుంబాలున్నాయి. వీరందరూ రకరకాల మట్టిబొమ్మలు, కళాఖండాలను తయారు చేయడమే వృత్తిగా జీవిస్తున్నారు. ఈ క్రమంలోనే కళ ద్వారా పలువురికి ఉపాధిని కల్పించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గంటావూరు సమీపంలోనే రూ.2కోట్ల వ్యయంతో టెర్రకోట హబ్‌ను ఏర్పాటు చేసింది. టెర్రకోట కళను యువతీ యువకులు నేర్చుతూ వారికి ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.

విదేశీ డిమాండ్ మేరకు..

ఇప్పటి వరకు ఇక్కడి హస్త కళాకారులు పలు రకాల మట్టి బొమ్మలను తయారు చేసేవారు. అయితే వివిధ రాష్ట్రాలనుంచి ఇక్కడికి వచ్చే మాస్టర్లు నేర్పిన సాంకేతికతతో మరెన్నో వినూత్న కళాఖండాలను రూపుదిద్దుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ మేరకు ఇక్కడ బొమ్మలను తయారు చేస్తున్నారు. ముఖ్యంగా సిటీ ప్రాంతాలకు అవసరమైన మొక్కలు పెంచే మట్టి కూజాలు ,మేడపై మొక్కలు పెంచుకొనేందుకు వీలుగా వేలాడే మట్టి కూజా, బంగ్లాల ముందు మొక్కలు పెంచేందుకు వీలుగా భారీ మట్టి కూజాలను తయారు చేస్తున్నారు. ఇక వేసవి కాలంలో ఫ్రిజ్‌లుగా ఉపయోగపడేలా కూజాలకు ట్యాప్‌లు అమర్చి రకరకాల సైజులు, వెరైటీలలో సిద్ధం చేస్తారు. అలాగే బహుమతులుగా ఇచ్చేందుకు వందలాది మోడళ్లు అందుబాటులో ఉంటాయి. ఫొటోఫ్రేమ్‌లను సైతం మట్టితోనే చేయడం గమనార్హం. రాజకీయ నాయకుల ముఖచిత్రాలను సైతం సుందరంగా తయారు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనూ అమ్మకాలు

టెర్రకోట కళాకారులు తయారు చేసిన మట్టి బొమ్మలు, వస్తువులను ఇప్పటికే బెంగళూరుకు చెందిన పలు కంపెనీలు సాయంతో ఆన్‌లైన్‌లో వ్యాపారాలు సాగిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో బుకింగ్ అయిన వాటిని బెంగళూరుకు పంపి అక్కడి నుంచి దేశ విదేశాల్లో విక్రయిస్తున్నారు. ఇటీవలే అమెరికాకు చెందిన కొందరు టెర్రకోట కాలనీకి వచ్చి ఇక్కడి వస్తువులను కొనుగోలు చేసుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో పలమనేరు టెర్రకోట కళ విశ్వవ్యాప్తం కానుంది.

కొత్త డిజైన్ల కోసం ప్రత్యేక శిక్షణ

టెర్రకోట హబ్‌లో గత ప్రభుత్వం టెక్నాలజీ డెవలప్‌మెంట్ అండ్ ట్రాన్స్‌ఫర్ సెంటర్ ఏర్పాటు చేసింది. దీంతో పాటు సీఎఫ్‌సీ (కామన్ ఫెసిలిటీ సెంటర్) ఉంది. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, టెర్రకోట హస్తకళాకారుల ఎయిడెడ్ సంస్థ, రీచ్ సంస్థల ఆధ్వర్యంలో ఇక్కడ తరచూ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల నుంచి నిపుణులను రప్పించి వారితో శిక్షణ ఇప్పిస్తుంటారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారికి ఇక్కడే ఉపాధి కల్పిస్తున్నారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో..

గతంలో మట్టికుండలు తయారీ నుంచి మనకు కనిపించే కుమ్మరి సారెకు బదులు ఎలక్ట్రికల్ వీల్ మిషన్ వాడుతున్నారు. గతంలో బంక మట్టిని కాళ్లతో తొక్కి మెత్తగా చేసేవారు. ఇందుకు బదులు ప్లగ్‌మిల్ మిక్సర్ అనే యంత్రం వచ్చింది. మట్టి వస్తువులను గతంలో బట్టీలో కాల్చేవారు. దీని స్థానంలో కరెంట్‌తో కాల్చే కిలన్ వచ్చింది.

ఆనందంగా ఉంది



“ టెర్రకోట బొమ్మల తయారీపై శిక్షణ తీసుకున్నా. ఇప్పుడు అన్ని బొమ్మల చేయడం నేర్చుకున్నా. ఇంటి వద్దే పీస్ వర్క్ చేసుకుంటున్నా. ఇక్కడ శిక్షణ తీసుకుని ఉపాధి పొందడం చాలా ఆనందంగా ఉంది. ఉన్న చోట ఉపాధి దొరికింది. డీఆర్‌డీఏ వాళ్ల పుణ్యమా అని, టెర్రకోట కళకు జీవం వచ్చింది. ఎందరికో పని చేసుకునే వెసులుబాటు దక్కింది. చేతిలో పని ఉంటే ఎక్కడైనా బతికేయవచ్చు.

– శాఖమ్మ, గంటావూరు

అప్‌డేట్ అవుతూ కొత్తగా తయారీ



పలమనేరు మట్టితో తయారైన టెర్రకోట కళాకృతులకు మన దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఇప్పుడిప్పుడే అమెరికా, ఫ్రాన్స్, చైనాలనుంచి ఆర్డర్లు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లోనూ కొన్ని ఏజెన్సీల ద్వారా వ్యాపారం చేస్తున్నాం. డిజైన్లపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్త శైలిలో బొమ్మలను తయారుచేస్తున్నాం. ఇందుకు సంబంధించి దేశంలోని పలు రాష్ట్రాల ట్రైనర్లు మాకు కొత్తవాటిని నేర్పుతున్నారు.

– రామకృష్ణ, టెర్రకోట హస్త కళాకారుల సంఘం నేత, పలమనేరు



గంటావూరులోని టెర్రకోట హస్త కళాకారుల శిక్షణ కేంద్రం



మట్టి పాత్రలు, కూజాలు



కోడి పుంజుల బొమ్మలు



కీలుగుర్రం ప్రతిమలు

డయేరియా.. డెంగీ నివారణే లక్ష్యం



బ్యానర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో డయేరియా, డెంగీ నివారణే లక్ష్యంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన బ్యానర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూలైలో డెంగీ, డయేరియా వ్యాధుల నివారణకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జూలై 1 నుంచి రెండు నెలల పాటు నిర్వహించనున్న స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని పక్కాగా పూర్తి చేయాలని సూచించారు. 0–5 ఏళ్లలోపు పిల్లలకు వచ్చే సీజనల్ డయేరియాపై సర్వే చేయాలని కోరారు. ఇంటింటి సర్వేలో గుర్తించే 5 ఏళ్ల లోపు పిల్లలకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్ల చొప్పున పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఓఆర్ఎస్ తో పాటు 14 రోజులు జింక్ మాత్రలు తప్పనిసరిగా వేయాలన్నారు. చంటి బిడ్డల తల్లులు డయేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో చిన్నపిల్లల వైద్యులకు సిఫార్సు చేయాలని ఆదేశించారు. డాక్టర్లు అలసత్వం వహించకుండా విధులు నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి, డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ అనిల్, డాక్టర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

వార్డు మెంబర్ల రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రం అందిస్తున్న వార్డు మెంబర్

రొంపిచెర్ల: రొంపిచెర్ల పంచాయతీలో నలుగురు వార్డు మెంబర్లు తమ పదవులకు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ రెడ్డప్పచ్చారి శనివారం తెలిపారు. ఒకటో వార్డు మెంబర్ ఎం.బావాజాన్, రెండో వార్డు ఎస్.షబీనా, ఐదోవార్డు చిన్న నాగరాజ, ఏడో వార్డు మెంబర్ మహ్మద్ హుసేన్ తమ రాజీనామాలను సమర్పించినట్లు వెల్లడించారు. వ్యక్తి గత కారణాలతో తాము రాజీనామా చేసినట్లు వార్డు మెంబర్లు తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఆదివారం సైతం చెల్లించే సౌకర్యం కల్పించినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని విద్యుత్ వసూలు కేంద్రాల్లో బిల్లులు కట్టవచ్చని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యావసరాల ధరల కట్టడికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిత్యావసర సరుకుల ధరల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ పెనుమూరు, కార్వేటినగరం, జీడీ నెల్లూరు, నగరి మండలాల్లో టమాట ధరలను నియంత్రించాలన్నారు. ప్రత్యేక మొబైల్ వాహనాల్లో టమాటాలను విక్రయించాలని సూచించారు. చిత్తూరు రైతుబజార్‌లో కందిపప్పు విక్రయాలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. జూలై 2వ తేదీ నుంచి చిత్తూరు రైతుబజార్‌లో కేజీ కందిపప్పు రూ.165 లకు విక్రయించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పప్పు, ధాన్యాల ప్రత్యేక కౌంటర్లను పాత మార్కెట్ వీధిలో హోల్ సేల్ డీలర్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్, సివిల్ సప్లయిస్ డీఎం మోహన్‌బాబు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదనరెడ్డి, మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్ పాల్గొన్నారు.

సత్వర న్యాయానికే ‘అదాలత్’



రివార్డు అందజేస్తున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్ : కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకే లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు తెలిపారు. శనివారం చిత్తూరులోని కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ చేపట్టారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అదాలత్‌ను జిల్లా జడ్జి ప్రారంభించారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో ఎవరు గెలిచారు..? ఎవరు ఓడిపోయారు..? అనేది అనవసరమని, శాశ్వత పరిష్కారం లభించడమే ముఖ్యమన్నారు. రాజీమార్గం ద్వారా ఇక్కడ పరిష్కరించుకునే కేసుల్లో గెలుపోటములు ఉండవన్నారు. అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులపై అప్పీల్‌కు సైతం వెళ్లే అవకాశం ఉండదని వెల్లడించారు. కేసుల పరిష్కారానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 34 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో శాశ్వత్ లోక్ అదాలత్ చైర్మన్ రమేష్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెన్నెల, న్యాయమూర్తులు శ్రీదేవి, శాంతి, కీర్తన, శ్రీనివాసులు, మాధవి, బాబాజాన్, బార్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్ పాల్గొన్నారు.

1,336 కేసుల పరిష్కారం

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌తో 1,336 కేసులను పరిష్కరించినట్లు జిల్లా జడ్జి భీమారావు తెలిపారు. అలాగే 253 ప్రీ లిటిగేషన్ కేసులు సైతం పరిష్కరించినట్లు వెల్లడించారు

రేపటి నుంచి కొత్త చట్టాలు

- న్యాయమూర్తులు, పోలీసులకు శిక్షణ
- బాధితులకు సత్వర న్యాయమే లక్ష్యం



చిత్తూరులో నిర్వహించిన నూతన చట్టాలపై అవగాహన సదస్సులో న్యాయమూర్తులు (ఫైల్)

చిత్తూరు అర్బన్ : ప్రజలకు సత్వర న్యాయమే లక్ష్యంగా పాత చట్టాల స్థానంలో పార్లమెంట్ నూతనంగా ఆమోదించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ) న్యాయ చట్టాలు జూలై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటికే ఈ చట్టాలపై ఎస్‌హెచ్‌ఓల నుంచి ఎస్పీ స్థాయి అధికారి వరకు శిక్షణ, అవగాహన కల్పించారు. న్యాయశాఖ ఆధ్వర్యంలో చిత్తూరు, తిరుపతి, మదనపల్లెలోని న్యాయమూర్తులకు దశలవారీగా శిక్షణ ఇచారు. పలు న్యాయ యూనివర్సిటీల నుంచి వచ్చిన అధ్యాపకులు అవగాహన కల్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నుంచి హైకోర్టు న్యాయమూర్తులు సైతం ఈ చట్టాలపై విస్తృతంగా చర్చించారు.

అవగాహన తప్పనిసరి



నూతన చట్టాల అమలు, మార్పులపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా స్టేషన్ హౌజ్ ఆఫీసర్లకు (ఎస్‌హెచ్‌వో) శిక్షణ ఇప్పించాం. అధికారుల స్థాయిలో కూడా దీనిపై అవగాహన కల్పించాం. కొత్త న్యాయ చట్టాలను జూలై 1వ తేదీ నుంచి అమలు చేస్తాం. నూతన సెక్షన్ల నమోదులో ఎస్‌హెచ్‌ఓలు పొరబాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉంది. ప్రజలు కూడా చట్టంలో వచ్చిన మార్పులను తెలుసుకోవాల్సి ఉంది. బాధితుడికి సత్వర న్యాయమే కొత్త చట్టాల అమలు ప్రధాన లక్ష్యం. – మణికంఠ, ఎస్పీ, చిత్తూరు

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా జూలై 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. పింఛన్ల పంపిణీపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ జిల్లాలో చేసిన ఏర్పాట్లను వివరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒకటో తేదీనే 100 శాతం పింఛన్ల పంపిణీకి ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్ అందించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కావాల్సిన నగదును బ్యాంకుల నుంచి ముందస్తుగా డ్రా చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ తులసి, ఎల్‌డీఎం హరీష్ పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం ప్రతిభ



నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించిన విశ్వం విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: నవోదయ విద్యాసంస్థలో 11వ తరగతిలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ ఫలితాల్లో ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి.లక్ష్మీనారాయణ ఉత్తమ ఫలితాలు సాధించి సీట్లు సాధించినట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. వీరితో పాటు 6, 9వ తరగతుల్లో కలిపి మొత్తం తమ విద్యార్థులు 48మంది ఈ ఏడాది నవోదయ విద్యాలయాల్లో సీట్లు సాధించడం తమకు గర్వకారణమని తెలిపారు. అనంతరం విద్యార్థులను ఆ విద్యాసంస్థ అడకమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్. తులసీ విశ్వనాథరెడ్డి అభినందించారు.

ఆదిలోనే అదుపు తప్పి..



బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం కొత్త సర్వీసుల ప్రారంభోత్సవం ఆదిలోనే అదుపు తప్పింది. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నూతన బస్సును కొంత దూరం నడిపారు ఈ క్రమంలో బస్సు ఓ మలుపు వద్ద పక్కనే ఉన్న బోర్డుకు తగిలింది. దీంతో బస్సు కిటికీ అద్దం దెబ్బతింది. శుభమా అని కొత్త సర్వీసు ప్రారంభిస్తుంటే ఈ అపశకునం ఏంటని పలువురు గుసగుసలాడుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. కొత్త సర్వీసులకు శ్రీకారం చుట్టారు. చిత్తూరు–బెంగళూరు–విజయవాడ సూపర్ లగ్జరీ, తిరుపతి- బెంగళూరుకు ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరుకు కొత్త సర్వీసులను తెప్పించే ప్రయత్నం చేస్తామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి మొదలవుతుందని చెప్పారు.

కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల ఆవేదన



ప్రిన్సిపల్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో తమ పోస్టులను కలుపుతున్నారని, గిరిజన గురుకుల పాఠశాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు లావణ్య, స్రవంతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు తమకు న్యాయం చేయాలని జిల్లా కేంద్రంలోని సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ చాలా మంది నిరుద్యోగులు కాంట్రాక్ట్ పద్ధతిలో గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమకు అన్యాయం చేసేలా ఈ పోస్టులను డీఎస్సీ కింద భర్తీ చేసేందుకు వివరాలు సేకరించారని మండిపడ్డారు. దీంతో వేలాది మంది రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సంఘం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబును కిసి న్యాయం చేయాలని కోరనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గురుకుల టీచర్లు ప్రియ, రేవతి, లిఖిత పాల్గొన్నారు.

కాణిపాకంలో పెరిగిన రద్దీ

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా భక్తులు భారీగా స్వామి దర్శనం కోసం క్యూకట్టారు. వరసిద్ధుని సుమారు 28,203 మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. అన్నదానం, గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1,02,340 విరాళాలు సమర్పించినట్లు వెల్లడించారు.

మామిడి తోటపై ఏనుగుల దాడి

బంగారుపాళెం: మండలంలోని గోవర్ధనగిరిలో శుక్రవారం రాత్రి స్థానిక రైతు సుదర్శన్‌నాయుడుకు చెందిన మామిడి తోటపై ఏనుగులు దాడి చేశాయి. చెట్ల కొమ్మలను విరిచేశాయి. ఈ దాడి కారణంగా చేతికందే దశలో పంట నేల పాలైనట్లు బాధితుడు తెలిపాడు. అటవీశాఖ అధికారులు స్పందించి పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నాడు. అలాగే ఏనుగులను అడవిలోకి మళ్లించాలని కోరాడు.

ఇంట్లో పేలిన గ్యాస్ సిలిండర్



కాలిన వస్తువులు

వి.కోట: మండలంలోని మావత్తూరు గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. గ్రామానికి చెందిన సుబ్రమణ్యం ఇంట్లో ఈ ప్రమాదం జరిగింది. దీంతో వంట సామాన్లు,సామగ్రి, ఫ్యాన్లు, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. కుటుంబీకులు, స్థానికులు మంటలను అదుపు చేసేందుకు విఫల యత్నం చేశారు. ప్రభుత్వం ఆదుకుని సాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.